ప్రజాశక్తి

ఆదివారం 23 జూన్ 2024 | 8 పేజీలు




గుంటూరు | పల్నాడు

నిరాశగా ఏరువాక

- ముందుకుసాగని సేద్యం
- పులిచింతల నీటినిల్వ కేవలం 0.39 టిఎంసీలు
- సగం మండలాల్లో వర్షపాతం లోటు
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నైరుతీ రుతుపవనాలు మందగించడంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో ఈ ఏడాది ఏరువాక పౌర్ణమి నిరాశజనకంగా జరిగింది. రైతులు ముఖంలో ఏమాత్రం ఉత్సాహం కన్పించలేదు. పలు గ్రామాల్లో రైతులు ఏరువాక పౌర్ణమి సందడిగా చేయాలని భావించినా వర్షాలు లేక, కాల్వలకు నీరు రాక చాలా మంది రైతులు తీవ్ర నిరుత్సాహంతో ఈ వేడుకలను నిర్వహించారు. ఏరువాకలో భూములను దుక్కి దున్నీ సంప్రదాయం ప్రకారం సేద్యానికి సిద్ధం చేసినా వారి మోములో ఉత్సాహం కన్పించడం లేదు. వర్షాలు లేక గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఖరీఫ్ సాగు పనులు ఇంకా వేగం పుంజుకోలేదు. చాలినంత వర్షాలు లేక రైతులు సేద్యం వైపు వెళ్లేందుకు తటపటాయిస్తున్నారు. సాధారణ వర్షపాతం నమోదు అయిన ప్రాంతాలలో కూడా కాల్వలల్లో నీరు లేక రైతులు సాగుపై దృష్టి సారించలేకపోతున్నారు. జలాశయాల్లో నీటి నిల్వలు బాగా తక్కువగా ఉండటంతో ఖరీఫ్ సాగు ఎప్పటికి ప్రారంభం అవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రధానంగా డెల్టా కాల్వలకు పులిచింతల నుంచి నీరు విడుదల కావాల్సి ఉంది. పులిచింతల జలాశయం గరిష్ట నీటి వల్ల 45.77 టిఎంసీలు కాగా శనివారం సాయంత్రంకు 0.39 టిఎంసిలు మాత్రమే నీటినిల్వ ఉంది. ఆల్మట్టి నిండితే తప్ప పులిచింతలకునీరు వచ్చే అవకాశం లేదని అధికారులు తెలిపారు. అలాగే శ్రీశైలంలో గరిష్ట నీటి నిల్వ 215.80 టిఎంసిలు కాగా ప్రస్తుతం 37.30 టిఎంసీలు మాత్రమే ఉంది. నాగార్జున సాగర్‌లో గరిష్ట నీటినిల్వ 312.01 టిఎంసిలుకాగా ప్రస్తుతం 122.35 టిఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. మొత్తంగా



▶ 2లో

జిల్లా నూతన కలెక్టరుగా నాగలక్ష్మీ

- విజయనగరం నుంచి గుంటూరుకు బదిలీ
- వేణుగోపాలరెడ్డికి పోస్టింగ్ ఇవ్వని ప్రభుత్వం
- జిఎడిలో రిపోర్టు చేయాలని ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ

గుంటూరు జిల్లా కలెక్టరుగా ఎస్.నాగలక్ష్మీ నియమితులయ్యారు. విజయనగరం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ ఆమె బదిలీపై గుంటూరుకు వస్తున్నారు. ఎన్నికల అనంతరం జిల్లా కలెక్టర్ల బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎం.వేణుగోపాలరెడ్డికి ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వలేదు. సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. 2015 నుంచి 2017 వరకు గుంటూరు మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన నాగలక్ష్మీకి ఈ ప్రాంతంపై అవగాహన ఉండటంతో ఆమెకు జిల్లా కలెక్టరుగా అవకాశం ఇచ్చారు. 2016లో కృష్ణా పుష్కరాల సందర్భంగా గుంటూరు కమిషనర్‌గా పనిచేసి నగర అభివృద్ధి కీలకభూమిక పోషించారు. నగరం నుంచి 12 రహదారుల విస్తరణకు చర్యలు చేపట్టారు. అంతేగాక గతంలో 2023లో అనంతపురం జిల్లా కలెక్టరుగా ఉండగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి ఓడిపోవడంతో అప్పట్లో ఆమెను అనంతపురం నుంచి విజయనగరంకు బదిలీ చేశారు. ఈ పరిణామం ఆమెకు మరోసారి పోస్టింగ్ దక్కేందుకు అవకాశం ఏర్పడింది. ఎన్నికల్లో వైసిపికి అనుకూలంగా వ్యవహరించారన్న పలువురు అధికారులకు ఈపోస్టింగ్‌లు ఇవ్వని ప్రభుత్వం కొద్ది మందికి అవకాశం ఇచ్చింది.

▶ 2లో



పొక్లెయినర్‌లతో వైసిపి కేంద్ర కార్యాలయాన్ని కూల్చివేసిన అధికారులు

అనుమతి లేకుండా నిర్మాణాలు

అధికారం అండతోనే ప్రభుత్వ స్థలంలో వైసిపి కార్యాలయం

సిఆర్‌డిఏ అధికారుల కూల్చివేతతో నేతల్లో కలకలం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి మండలంలో పలువురు అనుమతి లేకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో గత ప్రభుత్వం పార్టీ కార్యాలయ నిర్మాణానికి పూనుకుంది. ఎటువంటి అనుమతులు లేకుండా నీటి పారుదల శాఖ స్థలంలో నిర్మిస్తున్న వైసిపి కేంద్ర కార్యాలయ భవనాన్ని సిఆర్‌డిఎ అధికారులు శనివారం కూల్చివేశారు. తాడేపల్లి పట్టణంలోని సీతానగరంలో బోటుయార్డుకు సంబంధించిన రెండెకరాల ఇరిగేషన్ స్థలంలో నిర్మిస్తున్న ఈ భవనాన్ని యంత్రాలతో పడగొట్టారు. సిఆర్‌డిఎ అనుమతులు లేకుండా అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైసిపి అక్రమంగా ఈ భవనాన్ని నిర్మించిందని టిడిపి

▶ 2లో

పాల వ్యాపారికి నోటీసు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి బైపాస్‌రోడ్డులో కల్తీ పాలు విక్రయిస్తున్న వ్యక్తికి ఎంటిఎంసి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నోటీసులు అందజేశారు. సోమవారం కార్యాలయానికి వచ్చి తగిన వివ రణ ఇవ్వాలని ఆ నోటీసులో కోరారు. ప్రజాశక్తి శనివారం ప్రచురించిన 'కల్తీపాల అడ్డాగా తాడేపల్లి' కథనానికి అధికారులు స్పందించారు. కల్తీపాల వ్యాపారికి నోటీసులు అందజేశారు.



నిరాశగా ఏరువాక

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన జలాశయాల్లో కనీస నీటి నిల్వలు లేకుండాపోతున్నాయి. నాగార్జున సాగర్,శ్రీశైలంలో నీటి నిల్వ డెడ్ స్టోరేజికి చేరుకున్నాయి. జలాశయాల్లో నీటి నిల్వలు లేకుండా సాగుపై రైతులు ముందడుగు వేయలేకపోతున్నారు. జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో, పల్నాడు జిల్లాలో ఏడు లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయాల్సిఉంది. ఇప్పటి వరకు 22 ఎకరాల్లో ఆరుతడి పంటలువేశారని అధికార వర్గాలు తెలిపాయి. గుంటూరు,పల్నాడు జిల్లాల మొత్తం 46 మండలాలు ఉండగా దాదాపు 23 మండలాల్లో కనీస వర్షపాతం నమోదు కాక రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు.గత వారం రోజులుగా మళ్లీ ఎండలు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. వారంలో ఒక రోజు వర్షం పడితే మిగతా ఆరు రోజులు ఎండల తీవ్రత అధికంగా ఉండటం వల్ల సాగుకు అనువైన పరిస్థితులు ఏర్పడటం లేదు. 38 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. గుంటూరు జిల్లాలో జూన్ నెల మొత్తం 97.1 మిల్లీ మీటర్లవర్షం కురవాల్సి ఉండగా ఇప్పటివరకు 84.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లా మొత్తం మీద సగటున సాధారణంగా స్వల్పంగా అధికంగా కురిసినా 18 మండలాలకు గాను 9 మండలాల్లోనే సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదు అయింది. మంగళగిరి,కాకుమాను, దుగ్గిరాల, మేడికొండూరు,తాడేపల్లి, కొల్లిపర, ఫిరంగిపురం, తుళ్లూరు, వట్టిచెరకూరు మండలాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదు అయింది. పల్నాడు జిల్లాలో జూన్ నెలలో 80.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 65.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. పల్నాడు జిల్లాలో మొత్తం 28 మండలాలకు 14 మండలాల్లో కనీస వర్షపాతం నమోదు కాలేదు. మరో 14 మండలాల్లో వర్షం ఆశాజనకంగా నమోదు అయింది. మాచర్ల, వెల్దుర్తి, రెంటచింతల, కారంపూడి, గురజాల, మాచవరం, బెల్లంకొండ, పిడుగురాళ్ల, అచ్చంపేట, క్రోసూరు, పెదకూర పాడు, రాజుపాలెం, నాదెండ్ల , యడ్లపాడు మండలాల్లో వర్షం ఆశాజనకంగా ఉంది. దుర్గి, దాచేపల్లి, అమరావతి, సత్తెనపల్లి, నకరికల్లు, బొల్లాపల్లి, వినుకొండ, నూజెండ్ల, శావల్యాపురం, ఈపూరు, రొంపిచర్ల, నరసరావుపేట, ముప్పాళ, చిలకలూరిపేట మండలాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదు అయిందని అధికార వర్గాలు తెలిపాయి.

జిల్లా నూతన కలెక్టరుగా నాగలక్ష్మీ

(మొదటి పేజీ తరువాయి)

వీరిలో నాగలక్ష్మీ వరుసగా మూడో జిల్లాగా గుంటూరులో కలెక్టరు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. 2022 ఏప్రిల్ 2న జిల్లాల పునర్విభజనలో జిల్లా కలెక్టరుగా నియమితులైన ఎం.వేణుగోపాలరెడ్డి దాదాపు 26నెలలుపాటు పనిచేశారు. సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ దశలోనే కొన్ని జిల్లాల కలెక్టర్లను మార్చగా పోలింగ్ రోజున,అనంతరం జరిగిన ఘర్షణల నేపథ్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ బదిలీ అయ్యారు. కానీ గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఎన్నికల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. అయితే కొన్ని కారణాల వల్ల ఆయనకు రాజకీయ ముద్రపడింది. టిడిపి అధికారంలోకి రాగానే చంద్రబాబు నాయుడు నివాసానికి వెళ్లిన జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డికి చేదు అనుభవం ఎదురయింది. ఆయన నుంచి పూల బొకే స్వీకరించడానికి చంద్రబాబు నిరాకరించారు. దీంతో ఆయన తీవ్ర నిరాశకు గురయ్యారు. తరువాత సిఎంగా బాధ్యతలు స్వీకరించిన తరువాత సచివాలయంలో చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అయితే ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా సచివాలయంలోని సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలని ఆదేశించడం గమనార్హం.

పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధిపై సమీక్ష

హాజరైన ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు, కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో నిర్మాణదశలో ఉన్న 5 జాతీయ రహదారులు పూర్తీ చేయడానికి అవసరమైన నిధులు కొరకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ సంబంధిత అధికారులకు సూచించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టరేట్ శనివారం జాతీయ రహదారులు, ఇరిగేషన్ ప్రాజెక్ట్, రైల్వే లైను ఏర్పాటు, జల్‌జీవన్ మిషన్ మరియు వీవర్స్ షెడ్ల నిర్మాణం పై నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయులతో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపి కృష్ణదేవరాయులు పల్నాడు జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న 5 రహదార్ల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ మరియు నిధుల లభ్యత తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాలలో అవసరమైన వాటిపై చర్చించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యాలయం నుండి రాష్ట్ర ప్రధాన కార్యాలయం వరకు రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో ఎత్తి పోతల పథకాలు ఎన్ని ఉన్నాయి, ఎన్ని పూర్తీ స్థాయిలో పనిచేస్తున్నాయి వివరాలు సేకరించారు. అవసరమైన నిధులు కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అదేవిధముగా జల్ జీవన్ మిషన్ కార్యక్రమం కింద మంజూరు అయిన 1055 పనులకు గాను ఆయా పనులు ఏ దశలో ఉన్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతముగా పూర్తి చేయాలని, అవసరమైన నిధులు కొరకు ప్రతిపాదనలు త్వరితగతిన సిద్ధం చేయాలన్నారు. గుంటూరు బిబి నగర్ రైల్వే పనులు ఎంతవరకు పూర్తి అయ్యాయి, భూసేకరణ తదితర అంశములపై వివరాలు సేకరించారు. వీవర్స్ షెడ్స్ ఏర్పాటు పై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. కార్యక్రములో జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్, జిల్లా రెవెన్యు అధికారి కె.వినాయకం, రెవెన్యూ డివిజినల్ అధికారి సరోజ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పార్లమెంట్ సభ్యులు లావు, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, తదితరులు

అనుమతి లేకుండా నిర్మాణాలు

(మొదటి పేజీ తరువాయి)

సీనియర్ నాయకులు కేళి వెంకటేశ్వరరావు, దొంతిరెడ్డి సాంబిరెడ్డి దుయ్యబట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లి పట్టణంలోని సీతానగరం సర్వే నెంబర్ 202/ఎ1లో 8.30 ఎకరాలు బోటుయార్డుకు సంబంధించిన స్థలం ఉంది. ఇది పిడబ్ల్యుడివ వర్క్‌షాపుకు అనుబంధంగా ఉండేది. ఇక్కడ రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైన జల రవాణాకు సంబంధించి బల్లకట్టు, పడవలు, ఫంట్లు తదితర నిర్మాణాలు చేస్తుంటారు. రవాణా రంగానికి సంబంధించి మినీ ట్రక్కులకు కూడా ఇక్కడ అధికారులు పర్మిషన్ ఇవ్వాల్సి ఉండేది. 200 మంది కార్మికులు ఇక్కడ పని చేశారు. 90వ దశకంలో అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఆర్థిక విధానాల ఫలితంగా పిడబ్ల్యుడి వర్క్‌షాపుతో పాటు దానికి అనుసంధానంగా ఉన్న బోటుయార్డు కూడా ప్రమాదంలో పడ్డాయి. రిటైర్మెంట్ అయిన వారి స్థానంలో కొత్త వారిని తీసుకోకుండా వర్క్‌షాపును మూసివేసే ప్రయత్నాలు పెద్దఎత్తున జరిగాయి. ప్రధానంగా సిఐటియు ఇతర కార్మిక సంఘాలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాయి. అయినా ప్రభుత్వం నూతన సంస్కరణల వైపే మొగ్గుచూపి పిడబ్ల్యుడి వర్క్‌షాపుతో పాటు బోటుయార్డును నిర్వీర్యం చేసింది. అప్పటి నుంచి బోటుయార్డు స్థలం ఖాళీగా ఉంటుంది. ఈ స్థలంలోనే రెండు ఎకరాలు సంవత్సరానికి ఎకరా రూ. 1000 చొప్పున 30 సంవత్సరాల పాటు వైసిపి ప్రభుత్వంలో పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం లీజుకు తీసుకున్నారు. జల వనరుల శాఖ మంత్రిగా అంబటి రాంబాబు తన అధికారాన్ని ఉపయోగించి అధికారుల చేత అనుమతులు ఇప్పించేశారు. బోటుయార్డుకు చెందిన స్థలం సిఆర్‌డిఎ ఆధీనంలో ఉంది. సిఆర్‌డిఎ అనుమతులు ఈ స్థలానికి లభించలేదు. కనకదుర్గ వారధి నుంచి ఈ భవన నిర్మాణం చేపట్టిన ప్రాంతంలో సీడ్ యాక్సిస్ రోడ్డు వెళ్తుంది. రైల్వే లైన్‌ను దాటుకుంటూ సీతానగరం ప్రభుత్వాసుపత్రి పక్కగా కెఎల్‌రావు కాలనీ మీదుగా ప్రస్తుతం కొత్తగా నిర్మించిన కొండవీటి ఎత్తిపోతల పథకం పక్కగా నాలుగు కిలోమీటర్ల మేర ఫ్లైఓవర్ వస్తుంది. అక్కడ నుంచి రాజధానికి కనెక్టివిటీగా సీడ్ యాక్సిస్ రోడ్డు వెళ్తుంది. దీంతో అప్పట్లో సిఆర్‌డిఏ అనుమతి ఇవ్వలేదు. అధికారంలో ఉన్నారు కాబట్టి బోటుయార్డుకు సంబంధించి 8.30 ఎకరాల్లో రెండు ఎకరాల స్థలాన్ని కార్యాలయం నిర్మాణానికి వైసిపి నాయకులు తీసుకున్నారు. ఏడాది క్రితం పనులు మొదలుపెట్టారు. రెండు శ్లాబులు పూర్తయ్యాయి. ఈలోపు ఎన్నికలు వచ్చాయి. టిడిపి అధికారంలోకి రాగానే ఈ భవనంపై ఆ పార్టీ నాయకులు దృష్టి సారించారు. అక్రమ నిర్మాణం అని ఎప్పటినుంచో ప్రచారం జరుగుతున్న దీనిపై కొత్త ప్రభుత్వం సిఆర్‌డిఎ అధికారులను వివరణ కోరింది. తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని సిఆర్‌డిఎ అధికారులు ప్రభుత్వానికి తేల్చిచెప్పారు. ఇరిగేషన్ శాఖ కూడా లిఖితపూర్వకంగా అనుమతి ఇవ్వలేదు. సిఆర్‌డిఎ, మంగళగిరి తాడపల్లి మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ శాఖ ఇరిగేషన్‌కు సంబంధించిన ఈ భూమి వైసిపి నాయకులే బలవంతంగా అధికారాన్ని ఉపయోగించి నిర్మాణం చేపట్టాయని తేల్చిచెప్పాయి. దీంతో శనివారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో పది ప్రొక్లెయినర్లను తీసుకొచ్చి గంట వ్యవధిలో వైసిపి కార్యాలయాన్ని (అక్రమ కట్టడాన్ని) కూల్చివేశారు.



సంఘటనా స్థలంలో మీడియాతో మాట్లాడుతున్న అంబటి రాంబాబు

వైసిపి నేతల సందర్శన

మాజీ జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, మాజీ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ శేషగిరిరావు, ఎంటిఎంసి అధ్యక్షులు డి.వేమారెడ్డి అక్కడకు చేరుకున్నారు. కూల్చివేసిన కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ ఇది ముమ్మాటికీ కక్ష సాధింపు చర్య అని విమర్శించారు. మాకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా శనివారం, ఆదివారం కోర్టు సెలవులను అడ్డుపెట్టుకుని ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని చెప్పారు. తాము చట్ట ప్రకారం వెళ్తామని, టిడిపిలాగా చట్టాన్ని అతిక్రమించి వెళ్లమని తెలిపారు. ఇటువంటి చర్యలను ఎవరూ క్షమించరని చెప్పారు. ఈ విషయంపై తాము హైకోర్టులో పిల్ వేశామని, ప్రభుత్వం తరపున సిఆర్‌డిఎ అధికారులు కూడా వచ్చారని, కోర్టు కట్టడాన్ని కూల్చివేయమని చెప్పలేదని తెలిపారు. దీనిపై సోమవారం కోర్టుకు వెళ్తామని చెప్పారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి కార్యాలయాలు కూడా అక్రమంగా నిర్మించినవి ఉన్నాయని, మంగళగిరిలోనే రైతుల పంట కాలువను ఆక్రమించి టిడిపి కేంద్ర కార్యాలయాన్ని ఆక్రమించారని చెప్పారు. వాటిపై కూడా తాము దృష్టి పెడతామని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని చెప్పారు. టిడిపి సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ కేళి వెంకటేశ్వరరావు, దొంతిరెడ్డి సాంబిరెడ్డి మాట్లాడుతూ సీడ్ యాక్సిస్ రోడ్డులో వచ్చే దారిలో ప్రభుత్వానికి చెందిన ఇరిగేషన్ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. అధికారం ఉందని గతంలో ఇష్టం వచ్చినట్లు పోకడలకు పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణం కూల్చివేత ముమ్మాటికీ సరైనదేనని చెప్పారు.

ఏం చేసినా చెల్లుతుందనుకోవడం అవివేకం : వేమారెడ్డి

అధికారంలో ఉన్నాం కాబట్టి తాము ఏం చేసినా చెల్లుతుందనుకోవడం తప్పని వైసిపి ఎంటిఎంసి అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. నిర్మాణంలో ఉన్న కట్టడాన్ని కూల్చడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యంలో సరైనవి కావని చెప్పారు. ఆయన వెంట ఎం.అంజిరెడ్డి, యు.కల్యాణ్‌కుమార్, మధు, ఎలీషా తదితరులు ఉన్నారు.



పంట కాల్వల మరమ్మతులకు రూ.40 లక్షలు విడుదల

విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు : కొల్లిపర సమీక్షా సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - కొల్లిపర

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. శనివారం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అందరూ ప్రణాళిక బద్ధంగా పని చేసినప్పుడే ప్రజల సమస్యలను తీర్చవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఇబ్బంది పడకుండా పంట కాలువలు మరమ్మతులు చేసేందుకు రూ .40లక్షలు నిధులు విడుదల చేసినట్టు తెలిపారు. కొల్లిపర మండలంలోని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నూరు శాతం నిధులు సమకూర్చడమే కాక అదేవిధంగా పనిచేస్తానని ఆయన తెలిపారు. మండలాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచేటట్లు చర్యలు చేపడతామని తెలిపారు. వ్యవసాయ ఆధారిత మండలం కావున ఇరిగేషన్ శాఖ వ్యవసాయ శాఖ రైతులకు ఉపయుక్తంగా ఉండాలని సూచించారు. త్వరలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. రైతాంగాన్ని ఇబ్బంది పెట్టే పనులు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలను లను 14 రోజులలో పూర్తి చేయాలని, వర్షాకాలం కావున శానిటేషన్ పై దృష్టి పెట్టాలని వైద్యాధికారులకు సూచించారు. భూసేకరణలో అవకత జరిగాయి కావున పూర్తిస్థాయిలో విచారణ చేపడతామన్నారు. ఈ సందర్భం ర్భంగా డ్వాక్రా అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి 15 రోజులకు ఒకసారి రివ్యూ మీటింగ్ జరుగుతుందని, ప్రతి అధికారి తప్పనిసరిగా పాల్గొని తమ పని తీరు పట్ల సంతప్తికరంగా సమాధానం చెప్పాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు ప్రసాద్ తాసిల్దార్ శ్రీనివాసరావు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



చిన్నపిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెంపొందించేందుకు వైద్యశాఖ కృషి

పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

చిన్నపిల్లలలో సంభవించే నీళ్ల విరోచనాలు వాంతులు తదితర వ్యాధుల నివారణకు వారిలో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లో ఈ నెల 14 నుండి జూన్ 30 వరకు ప్రిపరేటరీ పేస్ మరియు క్యాంపియన్ పేజ్ జులై 1 నుండి ఆగస్టు 30వ తేదీ వరకు జరిగే ఐడి సిఎఫ్ (ఇంటెన్సిఫైడ్ డయేరియాల్ కంట్రోల్ పార్ట్ నైట్ ప్రోగ్రాం) అమలులో భాగంగా పల్నాడు జిల్లాలో ఇంటర్ డిపార్ట్మెంటల్ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 0 నుండి 5 ఏళ్ల పిల్లలలో సంభవించే నీళ్ల విరోచనాలు వాంతులు నివా రణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశం మేరకు ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని ఆదేశిం చారు. 5 ఏళ్ల లోపు పిల్లలకు వచ్చే డయేరియా ఇతర సాధారణ వ్యాధులు నివారణకు రానున్న వర్షా కాలంలో నీటి కాలుష్యం, పరిశుభ్రత పాటించ పోవడం, దోమల , ఈగల వలన సంభవించే వ్యాధులను నివారించేందుకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు ప్రజలకు పరిసరాల శుభ్రత, నీటి శుద్ధి విభాగం సిబ్బంది తాగు నీరు కలుషితం కాకుండా నీటి సరఫరా పైప్ లైన్లు ఎప్పటికప్పుడు మరమ్మతులు చూసుకుంటూ, తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయాలని, మురుగు కాల్వలలో మురుగు నీరు లేకుండా చూడాలని మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ, ఆర్డబ్ల్యూఎస్, అధికారులను ఆదేశించారు.

పాఠశాలలు కళాశాలలు, అంగన్వాడి సెంటర్లు, హోటళ్లు , సినిమా హాళ్లలో మరుగు దొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, శుద్ధి చేసిన తాగు నీటిని అందించాలన్నారు. చేతులు శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి పిల్లలతో పాటు పెద్దలకు అవగాహన కల్పించాలని తద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అవకాశం ఉంటుందని ఆ దిశగా అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా మండల స్థాయి, డివిజనల్ స్థాయి, జిల్లా స్థాయి ఆయా శాఖల అధికారులతో అవగాహన కార్యక్రమాలు కమ్యూనిటీ లెవెల్, విలేజ్ హెల్త్ క్లినిక్ లెవెల్ , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, జిల్లా స్థాయి హాస్పిటల్ లలో జరగాలని ఆదేశించారు. జులై 1 నుండి ఆగస్టు 30 వరకు పిల్లలలో డయోరియా వ్యాధిని నివారించడానికి ఓఆర్ఎస్ ప్యాకెట్స్ జింక్ టాబ్లెట్లు తగినన్ని ప్రతి ఇంటిలో ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో అమలు చేస్తున్న అడల్ట్ బి.సి.జి టీకా 60 ఏళ్ళు పైబడిన వారికి సోమ, గురువారాలలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, ఐసిడిఎస్ అధికారులు, జిల్లా విద్యాధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

టిడిపి పార్లమెంటరీ పార్టీ నేతగా శ్రీకృష్ణ దేవరాయలు నియామకం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నిత్యం ప్రజల కోసం అభివృద్ధి కోసం పరితపించే నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలకు సముచిత గౌరవం దక్కింది. పార్లమెంట్ సమావేశాలలో రాష్ట్ర అభివృద్ధి అంశాలపై ప్రసంగిస్తు గుర్తింపు సాధించుకున్న శ్రీకష్ణ దేవరాయలను టిడిపి పార్లమెంటరీ పార్టీ నేతగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం నియమించారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా టిడిపి విజయకేతనంలో శ్రీకృష్ణ దేవరాయలు కృషి ఎంతో ఉందని చంద్రబాబు నాయుడు కొనియాడారు. పార్లమెంటరీ నేతగా తన నియామకం మరింత బాధ్యత పెంచిందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం వద్ద మరింత కృషి చేస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు శ్రీకృష్ణ దేవరాయలు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న 5 ఏళ్ళలో పల్నాడు ప్రాంత అభివృద్ధిపై చెరగని ముద్ర వేసి పల్నాడు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదిస్తానని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.



శ్రీకృష్ణదేవరాయలను అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మున్సిపాలిటీ నిధులు గోల్‌మాల్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి తెనాలి :పురపాలక సంఘంలో నిధుల గోల్ మాల్ పై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి ఎక్కడా లేదని, పౌరులకు ఎమాత్రం ఉపయోగపడని తావుల్లో రోడ్లపై రోడ్లు వేసి మళ్ళీ వేసినట్లు రికార్డులు సృష్టించి నిధుల మింగారని విమర్శించారు. వారిపై తక్షణమే విచారణ చేసి మంత్రి నాదెండ్ల మనోహర్ తగుచర్యలు తీసుకోవలసిందిగా కోరారు. సహ చట్టం ప్రకారం దాదాపు రూ.200కోట్లు దుర్వినియోగం అయినట్లు సమాచారం ఉందన్నారు. ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ వేళ్ళూనుకున్న గంజాయి, అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ పై దృష్టిసారించారని, అలాగే మున్సిపల్ నిధులు గోల్ మాల్ పై కూడా దృష్టి సారించాలని, అక్రమార్కుల నుంచి ప్రజాధనం రాబట్టాలని కోరారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్, తెనాలి బండ్ పేరిట విగ్రహాలు ఏర్పాటు ను విమర్శించారు. సమావేశంలో పట్టణ అభివృద్ధి సంఘం అధ్యక్షులు దరిసి కోటేశ్వరరావు, నాయకులు రామకృష్ణమూర్తి, మాజీ ప్రిన్సిపల్ శాస్త్రీ, సిపిఎం నాయకులు కె బాబు ప్రసాద్, న్యాయవాది ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం బృందం సభ్యులు

రేపటి నుండి కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల ఏర్పాట్లు ఎన్నికల నిర్వహణ కౌంటింగ్ ప్రక్రియ తదితర అంశాలకు సంబంధించి కలెక్టరేట్ రెవెన్యూ అధికారులకు బాధ్యతలు ఉన్న నేపథ్యంలో కొన్ని నెలలుగా నిలిపివేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన మీకోసం పేరుతో సోమవారం నుండి నిర్వహించినట్లు కలెక్టరేట్ నుండి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పల్నాడు ప్రజలు ఆయా సమస్యలకు సంబంధించి పరిష్కారానికి సోమవారం మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో ఉంచండి

జిల్లా విద్యాశాఖ అధికారులకు ఎస్.ఎఫ్.ఐ విజ్ఞప్తి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యా హక్కు చట్టాన్ని పల్నాడు జిల్లాలో అమలు పరచడంలో జిల్లా విద్యాశాఖ అధికారులు వైఫల్యం చెందినట్లు ఎస్.ఎఫ్.ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కె.సాయి కుమార్ విమర్శించారు. శనివారం సాయి కుమార్ మాట్లాడుతూ ఫీజుల వివరాలు ప్రదర్శించడం లేదని ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తున్నా, పుస్తకాలను అమ్ముతున్నా విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యాహక్కు చట్ట ప్రకారం విద్యాసంస్థలో ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో బహిరంగంగా ప్రకటించాలి, స్కూల్ పేరు చివర ఏవిధమైన పేర్లను పెట్టకూడదు, ఏ విధమైన పుస్తకాలను, నోట్స్‌లను అమ్మకూడదని నిబంధన ఉన్నప్పటికీ ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రయివేటు కార్పోరేట్ విద్యాసంస్థలను ప్రత్యక్షంగా పరిశీలించి విద్యార్థులు వారి తల్లిదండ్రుల యొక్క అభి .ప్రాయాలను తెలుసుకోవాలని కోరారు.

నాడు వైద్యసేవ - నేడు ప్రజాసేవ

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నవ్యాంధ్ర తొలి సభాపతి టిడిపి సీనియర్ నాయకులు కోడెల శివప్రసాదరావు లాంటి మహనీయులు ఏలిన ప్రాంతం నుండి తనను గెలిపించి చట్ట సభలకు పంపించిన నరసరావుపేట నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని నిత్యం అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాలకు పైగా టిడిపి గెలుపు ఎరుగని నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. వైద్యునిగా 30 ఏళ్లకు పైగా పల్నాడు ప్రజలకు సేవ చేశానని గత 5 ఏళ్లుగా ప్రజలలో తిరిగి వారి సమస్యలు తెలుసుకున్నానని వారి సమస్యలు పరిష్కరించడమే తన ముందున్న కర్తవ్యమన్నారు. కమ్యూనిస్టు పార్టీ నుండి తన తాత మూడు సార్లు కాకినాడ ఎమ్మెల్యేగా గెలిచారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారం సలహాలు సూచనలతో నరసరావుపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు.

ఇప్పటం రైల్వే గేటు నాలుగు రోజులు మూత

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

ఎం.టి.ఎం.సి పరిధిలోని ఇప్పటం మంగళగిరి మధ్య లెవెల్ క్రాసింగ్ గేట్ ను, రైల్వే బెడ్ ఏర్పాటు నిమిత్తం జూన్ 24వ తేదీ నుండి 27వ తేదీ వరకు, ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు, ఇప్పటం లెవెల్ క్రాసింగ్ (305) గెట్ ను నాలుగు రోజులపాటు మూసి వేయనున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే (విజయవాడ డివిజన్)అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంతం గుండా ప్రయాణం చేసే వాహనదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ప్రత్యామ్నాయ మార్గం చూసుకోవాలని అధికారులు తెలిపారు.



కేసానుపల్లిలో పర్యటిస్తున్న డాక్టర్ బి.రవి

అతిసార వ్యాధి గ్రస్తులను గుర్తించి చికిత్స

- కేశానుపల్లిలో ఉచిత వైద్యశిబిరం
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కొన్ని రోజులుగా దాచేపల్లి మండలం కేసానపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో అతిసారా వ్యాధి రావడంతో పలువురు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పంచాయతీ, వైద్య సిబ్బందితో కలిసి ఆ గ్రామంలో పర్యటించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. రవి మాట్లాడుతూ, శనివారం కూడా అదే కాలనీలో మూడు అతిసార కేసులు నమోదైనట్లు చెప్పారు. గ్రామంలో వ్యాధి తగ్గుముఖం పట్టే వరకు వైద్య శిబిరం కొనసాగించాలని ఆదేశించారు. అతిసార వ్యాది గ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. పంచాయతి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సక్రమంగా పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. గ్రామీణ త్రాగు నీటి సరఫరా విభాగం సిబ్బంది, నీటి ట్యాంకులను శుభ్రం చేయడం, క్లోరినేషన్ చేయడం తప్పనిసరి అని సూచించారు. ఆయా పనులను ఆయన పరిశీలించారు. ఎంపిడిఓ వెంకట రమణ, గ్రామ సర్పంచ్ శ్రీపతి ప్రసాద్,పంచాయతీ కార్యదర్శి నాగండ్ల రత్నం కి, వైద్యాధికారి డాక్టర్ సహిన్ సుల్తాన్ లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నెల్లూరు రామకోటయ్య, ఈవోపీఆర్డీ జోషిరాజు, వైద్య సిబ్బంది పట్టాభి, సిహెచ్ఓ కృష్ణకుమారి, హెల్త్ సూపర్వైజర్లు పి.ఎల్.ఎస్ దేవి, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున వ్యవసాయ శాఖాధికారి డి.కృష్ణయ్య

పంట సాగుదారు హక్కు పత్రాలపై అవగాహన

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండలంలోని చంద్రారాజుపాలెం, న్యూ చిట్యాలలో పంట సాగుదారు హక్కు పత్రాలపై అవగాహనా కార్య క్రమాలు శనివారం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో చం ద్రాజుపాలెంలో వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య మాట్లా డుతూ గ్రామంలో కౌలుకు సాగు చేయు రైతులందరు తప్పనిసరిగా పంట సాగుదారు హక్కు పత్రం తీసుకోవాలని అందుకుగాను భూ యజమాని ఆధార్, సాగుదారు ఆధార్, మొబైల్ నంబర్తో గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ రైతు భరోసాకేంద్ర సిబ్బందిని సంప్రదించి సిసిఆర్సి కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంట సాగు దారు హక్కు పత్రం 11 నెలలు గడువు కలిగి, భూ యజమాని హక్కులకు భంగం కలుగకుండా జారీ చేస్తారని, భూ యజ మానులు, పంట సాగు దారులకు సహకరించాలని కోరారు. పంట నమోదు తద్వారా పంట ఉత్పత్తు లకు కనీస మద్దతు ధరలు పొందేందుకు, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టాలు సంభవించిన నష్ట పరిహారం, రైతు భరోసా తదితర ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఈ హక్కు పత్రాలు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో వన్నాయ పాలెం, కందిపాడు గ్రామ రెవెన్యూ అధికారి ఎస్ కె కిస్మా తున్నిసా, కత్తి దర్శి రజని, ఆర్ అసాబీ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడ్డ కౌలు రైతు కుటుంబానికి

రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించండి

- ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం డిమాండ్
- అబ్బూరులో మృతుడి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సత్తెనపల్లి మండలం అబ్బూరులో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు బ్రహ్మ య్య కుటుంబాన్ని రాధాకృష్ణ రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు వేపూరి గోపాలరావు, జిల్లా ఉపాధ్యక్షులు గద్దె చలమయ్య కౌలు రైతు సంఘం. జిల్లా సహాయ కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావులు శనివారం పరామర్శిం చారు. అబ్బూరు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ నీటి వసతి వున్న పొలాలకు కూడా పంటల బీమా పథకాన్ని వర్తింప చేయాలని, అలాగే, భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాడు ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుం బానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి హోదాలో ఉన్న పవన్ కల్యాణ్ ,కౌలు రైతుల ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసు కోవాలని, ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతుల కుటుం బాలకు నష్టపరిహారం చెల్లించి, వారి పిల్లల చదువులకు ఆటంకం లేకుండా కూటమి ప్రభుత్వం సహాయం చేయా లని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు రత్నాకర్ . వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



కౌలు రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కౌలు రైతు సంఘం, రైతు సంఘం నాయకులు

యాచకురాలికి పుట్టిన పాపకు సంరక్షణ అవసరం

- తల్లీబిడ్డలకు ప్రాణాలు పోశాం
- ఇప్పటికే ఆమెకు ఇద్దరు బిడ్డలు
- మూడో బిడ్డను పోషించలేనంటోంది
- ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టరు ఉదయభాను



ప్రజాశక్తి-మాచర్ల

తాము ఇటీవల క్లిష్ట పరి స్థితులలో ఉన్న ఒక మహిళకు కాన్పు ప్రక్రియను పూర్తి చేసి, తల్లిని, పుట్టిన ఆడ బిడ్డను కాపాడినట్లు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ ఉదయ భాను తెలిపారు. శనివారం ప్రభుత్వ వైద్య శాలలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఈ నెల 9వ తేది అర్ధరాత్రి ఆర్ అండ్ బి బంగ్లా ఎదురుగా ఉన్న షాపుల వద్ద యాచక మహిళ మేకల శ్రీలక్ష్మీ అసంపూర్తి కాన్పు అయి ఇబ్బంది పడుతున్నట్లు తమకు సమాచారం వచ్చినట్లు తెలిపారు.తాము ఆ మహిళని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కాన్పు ప్రక్రియను పూర్తి చేసి.. తల్లీ, పుట్టిన ఆడబిడ్డకు డ్యూటీ డాక్టరు సౌమ్య వైద్య సహాయం అందించి కాపాడినట్లు తెలి పారు. బిడ్డ తక్కువ బరువుతో పుట్టడంతో, పిల్లల సంరక్షణ డాక్టరు వివేక్ పర్యవేక్షణలో, బిడ్డ కొంత బరువు పెరిగేలా చేసి నట్లు వివరించారు. తలీబిడ్డలను ఆసుపత్రి నుంచి డిస్చార్జ్ చేసే సమయంలో కొత్త విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. శ్రీలక్ష్మీకి ఇప్పటికే ఇద్దరు సంతానం.. ఒక మగ బిడ్డ, ఆడబిడ్డ ఉన్నారని చెప్పారు. మూడో సారి గర్భవతి అయిన తర్వాత ఆమె భర్త వెళ్లిపోయాడని, భర్త ఉన్న సమయంలో వారు కూలీ పనులు చేసుకుని జీవించేవారు. ఆమె భర్త వెళ్లిపోయిన తర్వాత యాచక వృత్తి చేసుకుంటోందని, మూడవ బిడ్డ భారం మోయలేనని, ఇప్పటికే ఇద్దరు పిల్లలతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పిందన్నారు. పసిపాప గురించి తాము ఐసిడిఎస్, సర్కిల్ ఇన్స్పెక్టర్తో చర్చిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వైద్యాధికారికి కూడా ఈ విషయాన్ని తెలియజేశామన్నారు. బరువు తక్కువ ఉన్న పాపకు సరైన పోషణ ఎంతో అవసర మన్నారు. సంబం ధిత అధికారులతో మాట్లాడి పాప సంర క్షణపై చర్యలు తీసు కుంటున్నట్లు వివరించారు. డాక్టరు జయ ప్రకాష్ మాట్లా డుతూ ప్రస్తుత పరిస్థితులలో పాపకు సొసైటి నుండి సహకారం అవసరమని వివరించారు. సమావేశంలో డాక్టర్లు మరియసాగర్ రాణి, సౌమ్య, వివేక్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-యడ్లపాడు

యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ, లింగా రావుపాలెం విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెగ్యులర్ షుగర్, బిపిల ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. యడ్ల పాడులోని పి.ఆర్ విజ్ఞాన కేంద్రంలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వ హించ నున్నారు. రెండు నెలలకు సరిపడా మందులు ఇస్తామని, ఈ అవ కాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వా కోరారు. ఉచిత వైద్య శిబిరం పర్యవేక్ష కులుగా సీనియర్ డాక్టర్ ఎల్. మోహన్ భాస్కర్ వ్యవహరించనున్నారు.

నియోజకవర్గంలో శాంతిభద్రతలపై వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర డిసిపి గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ద్వారకా తిరుమలరావును నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదరవాడ అరవింద్ బాబు శనివారం డిజిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట నియోజక వర్గంలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని నిష్పక్ష పాతంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఎన్నికల రోజు ఆ తరవాత రోజు నరస రావుపేటలో వాటిల్లిన ఘటనలపై విచారణ జరిపి నిందుతులను కఠి నంగా శిక్షించా లన్నారు. నియో జకవర్గంలో శాంతి భద్రతల గురించి వివ రించారు. నియో జక వర్గంలో జరిగిన ఘట నలు, ప్రస్తుత పరి స్థితుల గురించి వివరించారు.



డిజిపి ద్వారకా తిరుమలరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

మూడోసారి ఎమ్మెల్యేగా

జీవీ ఆంజనేయులు ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-వినుకొండ

సార్వత్రిక ఎన్నికల్లో అద్భుత విజయం అందుకున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ శాసన సభ్యులు జీవీ ఆంజనేయులు శనివారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర 16వ శాసనసభ సమా వేశాల రెండో రోజు ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆయనతో ప్రమాణం చేయించారు. వినుకొండ నుంచి మూడోసారి గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టిన ఏకైక వ్యక్తిగా కూడా జీవీ ఆంజనేయులు ఈ సందర్భంగా అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. 2009లో తెలుగుదేశం పార్టీ తరపున వినుకొండ నుంచి పోటీ చేసిన జీవీ భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. తెలుగుదేశం పార్టీకి ఏకంగా 51.9శాతం ఓట్లు సాధించారు. తర్వాత 2014 ఎన్నికల్లో ముందు ఎన్నికల ఆధిక్యాన్ని తిరగరాస్తూ ఏకంగా 52.77 శాతం ఓట్లతో గెలుపొందారు. 2019లో ఓడిపోయినా 2024 ఎన్నికల్లో విజయం సాధించారు. 30వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో బొల్లా బ్రహ్మనాయుడిపై బదులు తీర్చుకున్నారు. విను కొండ నియోజకవర్గంలోని ఈపూరు మండలం ఇనుమెళ్ల గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో ఆంజనేయులు జన్మించారు. బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశారు.

ఆఖరి క్షణం వరకు ప్రజల కోసమే..

అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన ఆంజనేయులు బయటకు వచ్చిన అనంతరం మాట్లాడుతూ నవ్యాం ధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో పనిచేసే అద్భుత అవకాశం రావడం అదృ ష్టంగా భావిస్తున్నాఅన్నారు. ఈ సదావకాశం ఇచ్చిన విను కొండ నియోజకవర్గం ప్రజలు అందరికీ తన ప్రమాణ స్వీకారం సందర్భంగా కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తు న్నట్లు తెలిపారు. ఎంతో నమ్మకంతో ప్రజలు ఇచ్చిన అవ కాశం, అధికారం... ఆఖరిక్షణం వరకు వారికోసమే, వారి తోనే ఉంటానని మాటిస్తున్నానని చెప్పారు.



ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తున్న జీవీ ఆంజనేయులు

తెనాలిని పట్టి పీడిస్తున్న మురుగునీటి సమస్య

- మంత్రి హయాంలోనైనా పరిష్కారమయ్యేనా..!
- అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థపై అధికారులు దృష్టి సారించేనా?

ప్రజాశక్తి-తెనాలి

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ... సైడ్ డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు... మురుగునీటి పారుదల సరళీకృతం.. ఇవన్నీ హామీలకే పరిమితమౌతున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తొలి నాళ్ళలో ఎమ్మెల్యేలు డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు పరుస్తామని హడావుడి చేయటం, పురపాలక సంఘ నిధులను కోట్లలో ఖర్చు చేసి మిన్నకుండటం పరిపాటిగా మారింది. ఆ సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరించే తీరిక లేకుండా వ్యవహరిస్తున్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ అవసరమంటూ అందరూ చెప్పటమే కాని ఆచరణలో అడుగు ముందుకు పడటంలేదు. ఫలితంగా చిన్నపాటి వర్షానికి సైతం మురుగు రోడ్లపైకి చేరి ప్రధాన రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. పట్టణంలో మురుగునీటి పారుదల అస్థవ్యస్థం వివరాలిలా ఉన్నాయి.



గాంధీచౌక్ నుంచి కచేరి వెళ్ళే రోడ్డులో కాలువలు పొంగి రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



సైడ్ డ్రెయిన్లలో పేరుకున్న వ్యర్థాలను పరిశీలిస్తున్న మనోహర్

పట్టణంలో పురపాలక సంఘం పరిధిలో మొత్తం 9 శానిటిరి డివిజన్లు ఉన్నాయి. వీటిలో రెండు పర్మినెంట్ కాగా, ఏడు డివిజన్లు ప్రైవేటుగా నిర్వహిస్తున్నారు. పారిశుధ్యం మెరుగుకు పారిశుధ్య కార్మికులు శాశ్వత ప్రాతిపదికన 88 మంది, ఔట్ సోర్సింగ్ విధానంలో 327 మంది పనిచేస్తున్నారు. వీరికి అదనంగా ప్రతి మూడు నెలలకు ఓ సారి 40 మంది కార్మికులను కాలువల్లో షిల్టు తొలగించేందుకు తీసుకుంటారు. పటిష్టమైన శానిటరి వ్యవస్థ ఉన్నప్పటికీ మురుగునీటి సమస్య పట్టణాన్ని పట్టి పీడిస్తుంది. దీనికి కారణం సైడు కాల్వలపై ఆక్రమణలు పెరిగి పోయాయి. షాపులు, టిఫిన్ సెంటర్లు నిర్వహించేందుకు వ్యాపారులు సైడ్ డ్రెయిన్లను ఆసరా చేసుకుని, వాటిపై ఫ్లోరింగ్ చేసి, కాలువలను పూర్తిగా మూసేస్తున్నారు. వాస్తవానికి కాలువల్లో వ్యర్థాలను రోజువారి తొలగించాలి. కాని కాలువలపై ఆక్రమణలు ఎక్కువ కావటం, కొన్ని చోట్ల శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలు ఉండటంతో కాలువల్లో వ్యర్థాలు తొలగించేందుకు కార్మికులకు వీలుకాని పరిస్థితి. సైడు డ్రెయిన్లపై వ్యాపారాలు నిర్వహించే వారు కూడా వ్యర్థాలను కాలువల్లోనే పడేస్తున్నారు. వ్యాపార కూడళ్ళ నుంచి వెలువడే వ్యర్థాలు కాలువల్లో చేరటం, కాలువల్లో వ్యర్థాలు తొలగించేందుకు వీలు లేకపోవటం మురుగునీటి పారుదల అధ్వాన్నంగా మారటానికి కారణాలుగా చెప్పొచ్చు. అయితే పురపాలకల సంఘంలో పాలక వర్గం మారినపుడో, కమిషనర్ మారినపుడో, శాసనసభ్యులు మారినపుడో కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు హడావుడి చేయటం, రాజకీయ ఒత్తిళ్ళు ఇతర కారణాలతో మిన్నకుండటం పరిపాటిగా మారింది. దీంతో మురుగు పారుదల ఎక్కడికక్కడ స్థంభించిపోతుంది. ఫలితంగా వర్షాలు పడినపుడు మురుగు కాలువలు పొందిపోతున్నాయి. ప్రధాన వీధుల్లో వర్షపునీటికి మురుగునీరు తోడై పరిస్థితి దుర్భరంగా మారుతంది. అయితే ప్రతి ఏటా కాలువల్లో షిల్టు తొలగించేందుకు మున్సిపల్ నిధులను కోట్లలో వెచ్చిస్తున్నారుగాని, క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించి, శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయటం లేదు.

పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ అవసరమే

పట్టణంలో మురుగు సమస్య పరిష్కారానికి అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ వ్యవస్థ అనివార్యం. ఈవిషయాన్ని 2004, 2009 కాలంలో తెనాలి శాసనసభ్యులుగా, స్పీకర్గా, డిప్యూటీ స్పీకర్గా పనిచేసిన నాదెండ్ల మనోహర్ గుర్తించారు. కాని దానికి సంబంధించి పురోగతి లేదు. తదుపరి అధికారంలోకి వచ్చిన టిడిపి, వైసిపి కూడా అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్పై ప్రకటనలకే పరిమితయ్యాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మూడో సారి ముచ్చటగా తెనాలి ఎమ్మెల్యేగా ఎన్నికైన నాదెండ్ల మనోహర్ ఈ సమస్యపై దృష్టి సారించారు. రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖామంత్రిగా కూడా బాధ్యతలు చేపట్టిన ఆయన పట్ట డ్రెయినేజ్ సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత నిచ్చారు. ఆగమేఘాల మీద పాలాద్రి, పాటికాల్వల్లో షిల్టు తొలగింపచేశారు. అయినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దగా ఫలితం కనిపించలేదు. ఈ సందర్భంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ వ్యవస్థ అవసరమన్న అభిప్రాయం మనోహర్ వ్యక్తం చేశారు కూడా. ఈ నేపథ్యంలో డ్రెయినేజ్ సమస్య పరిష్కారానికి మనోహర్ పటిష్ట చర్యలు తీసుకుంటారని ప్రజలు భావిస్తున్నారు.



కమిషనర్కు వినతిపత్రం ఇస్తున్న చెంగయ్య, జెవి రాఘవులు తదితరులు

పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి

కమిషనర్కు సిపిఎం వినతి

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ వి నిర్మలా కుమార్కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండటం వలన దోమల పెరిగి ప్రజల అనారోగ్యానికి కారణమవుతాయని విన్నవించారు. ఇప్పటికే విజయవాడ గుంటూరు నగరాలలో అతిసార ప్రబలి మరణాలు సంభవించాయని తెలిపారు. చెత్త పేరుకు పోతే అంటు వ్యాధులు, డెంగీ, మలేరియా, విషజ్వరాలు వస్తాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వస్తున్నాయని ముందస్తుగానే వాటిని అరగట్టడానికి చర్యలు చేపట్టాలని కోరారు. క్లాప్ ఆటో డ్రైవర్లు గత రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం వలన పనిలో లేకపోవడం వలన పట్టణంలో పారిశుధ్యం పెరిగి కొప్పుల కుప్పలుగా ఉందని తెలిపారు. వెంటనే మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్మికుల సంఖ్య తక్కువగా ఉందని, జనాభా తగ్గట్టుగా పెంచాలని కోరారు. పారిశుధ్య కార్మికులను ఇతర పనులకు కేటాయించవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వివి జవహర్లాల్, ఎం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసుల భవితవ్యం ఏమిటి?

ప్రజాశక్తి-తాడేపల్లి

గత ప్రభుత్వం మహిళల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి తక్షణమే పరిష్కారం చేయడానికి మహిళా పోలీ సులను నియమించింది. స్థానిక సచివాలయ కేంద్రంగా వీరు పని చేస్తుంటారు. ఆయా సచివాలయం పరిధిలో వచ్చే మహి ళలపై హింస, కుటుంబ సమస్యలు వీరు పరిష్కారం చేయాల్సి ఉంటుంది. పరిష్కారం చేయలేకపోతే స్థానిక మహిళ ఇచ్చిన రిపోర్టు తీసుకుని పోలీస్స్టేషన్కు వెళ్లాల్సి ఉంటుంది. పోలీస్ స్టేషన్కు వచ్చేందుకు మహిళలు వెనుకంజ వేస్తున్నారనే ఉద్దేశంతో వారి సమస్యలను స్థానికంగా గుర్తించి పరిష్కరిం చాలనే ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల మంది మహిళా పోలీసులను నియమించింది. తాడేపల్లి పట్టణంలో 16 సచివాలయాలకు 16 మందిని నియమించారు. వారికి కానిస్టేబుల్ హోదా కల్పిస్తే ప్రభుత్వం జిఒ జారీ చేసింది. రానురాను మహిళా పోలీసులు కుర్చీలకే పరిమితం అయ్యే పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయిలో పర్యటించి సామాన్య ప్రజల సాధకబాధకాలు తెలుసుకోవాల్సిన మహిళా పోలీసులకు సరైన విధులు అప్పగించ కపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. వారానికి రెండు నుంచి మూడు సార్లు స్థానిక పోలీస్స్టేషన్కు వెళ్లి పోలీస్స్టేషన్ అధికారి శాంతి భద్రతల నియంత్రణ విషయంలో అవగాహన కల్పిస్తారు. ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం వచ్చింది. సచివాలయాల్లో నియమించిన మహిళా పోలీస్ పట్ల అప్పట్లోనే సరైన స్పందన లేకపోవడంతో కొత్త ప్రభుత్వం వీరి పట్ల ఎలా వ్యవహరిస్తుంది, వీరికి అధికారాలు బదిలీ చేస్తారా, సచివాలయాల్లో మహిళా పోలీస్ వ్యవస్థను ఉంచుతారా ఎత్తేస్తారా అనేది తేలాల్సి ఉంది.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించండి : వ్యకాస

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న ఈమని అప్పారావు

ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. శనివారం బ్రాడీపేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు అధ్యక్షతన జిల్లా విస్తృత సమావేశం జరిగింది. సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ ఇంకా వ్యవసాయ పనులు ప్రారంభం కానందువల్ల వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. అలాగే గత మూడు, నాలుగు వారాలుగా పనిచేసిన కూలీలకు వేతనాలు ఇవ్వలేదని, వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో రాజధాని ప్రాంతంలో సంవత్సరం పొడుగునా ఉపాధి హామీ పనులు కల్పిస్తామని చెప్పారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం రాజధాని ప్రాంతంలోని వ్యవసాయ కూలీలకు రాజధాని ప్రాంతంలో ఉపాధి పనులు కల్పించలేదని ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం రాజధాని ప్రాంతంలో వ్యవసాయ కూలీలు ఉపాధి పనులు కల్పించి సుదూర ప్రాంతాలకు పనుల కోసం వలసలు వెళ్లే పరిస్థితిని నివారించాలని కోరారు. కౌలు రైతులకు యజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డు ఇచ్చే విధంగా చట్టసవరణ చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ వ్యవసాయ పనులు ప్రారంభం అవుతున్నా యని, ఇప్పటికీ పంట కాలువలు తూటాకు ముళ్ళకంపతో నిండి ఉన్నాయని వాటిని బాగు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గతంలో హైలెవెల్ ఛానల్ పూర్తిచేయాలని రైతు సంఘాలు, కౌలురైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఆందోళన నిర్వహించాయని రాష్ట్ర ప్రభుత్వం హైలెవెల్ ఛానల్ పూర్తి చేయాలని కోరారు. అలాగే గుంటూరు ఛానల్కు నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరారు. వ్యవసాయ పనులు ప్రారంభం అవుతున్నాయి కాబట్టి వ్యవసాయ కూలీలకు కనీస వేతనం అమలు జరిగేటట్లుగా గ్రామాల్లో ప్రభుత్వమే ప్రచారం నిర్వహిం చాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.కోటేశ్వరి, శివయ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

24న ఐటిఐలలో ప్రవేశాల కోసం ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కాలేజిలో ప్రవేశాల కోసం ఈనెల 24న రెండో దశ ఇంటర్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్థాయి శిక్షణా కేంద్రం, పారిశ్రామిక శిక్షణా సంస్థ గుంటూరు సహాయ సంచాలకులు సాయివరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19, 20 తేదీల్లో మొదటి దశ ఇంటర్యూలు జరిగాయన్నారు. మిగిలిన సీట్ల కోసం సోమవారం తెనాలిలోని ప్రభుత్వ ఐటిఐ కాలేజిలో ఇంటర్యూలు జరుగుతాయన్నారు. కాగా మెరిట్లో సీటు రాని విద్యార్థులు ప్రభుత్వ ఐటిఐ గుంటూరులో మేనేజ్మెంట్ కోటాలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడర్స్లో సంవత్సరానికి రూ.10వేలు, మెకానిక్ మోటర్ వెహికిల్, డ్రాఫ్ట్ మెన్ సివిల్ లో సంవత్సరానికి రూ.8వేల ఫీజు చెల్లించి చేరవచ్చున్నారు. ఇతర వివరాల కోసం 8978025794, 8333973929 నంబర్లలో సంప్రదించాలన్నారు.



రాజధాని అమరావతిలోని రాయపూడి వద్ద నిర్మిస్తున్న సిఆర్డిఎ కార్యాలయం

ఊపందుకున్న సిఆర్డిఎ కార్యాలయ నిర్మాణం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి లో సి ఆర్ డి ఎ నూతన కార్యాలయం నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. రాయపూడిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాల వద్ద సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన కార్యాలయం నిర్మిస్తున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో కొంత కాలం పాటు భవన నిర్మాణం పనులు నిలిచిపోయాయి. తిరిగి మరలా కొంతకాలం నుంచి పనులు మొదలయ్యాయి. 3.62 ఎకరాలలో జి ప్లస్ 7 అంతస్తులతో రూ 54.12 కోట్ల వ్యయంతో కార్యాలయం నిర్మాణం జరుగుతోంది.ప్రస్తుతం సిఆర్డిఎ ప్రధాన కార్యాలయం విజయవాడలో ఉంది. రాయపూడిలోని కార్యాలయం నిర్మాణం పూర్తయితే సిఆర్డిఎ కార్యకలాపాలన్నీ ఇకనుంచి అమరావతి నుంచే జరిగే అవకాశం కలుగుతుంది.



శ్రీనిధి రికవరీపై విచారణ

- రాష్ట్ర సిఆర్‌పి బృందం మండలంలో పర్యటన
- విలేజ్ ఆర్గనైజర్స్ రిజిసర్ల తనిఖీ
- సిబ్బందిపై చర్యలు తీసుకోండి: డ్వాక్రా మహిళలు


ప్రజాశక్తి -అచ్చంపేట

అచ్చంపేట మండలం వెలుగు కార్యాలయంలో సంవత్సర కాలంగా శ్రీనిధి రుణాల అవకతవకలపై ఎన్నోసార్లు విచారణ జరిగింది ఈ విషయమై పలుసార్లు పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ కూడా సమస్య అలాగే ఉంది అయినప్పటికీ శ్రీనిధి సొమ్ము నేటికీ జమకాక పోవడంతో రాష్ట్ర సిఆర్‌పి బృందం మండలంలో శనివారం విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా పెదపాలెం క్లస్టర్ లో రాష్ట్ర సీఆర్పీలు విమల, అనూష, అన్నపూర్ణ, అనురాధ, ప్రేమలతతో పాటు సత్తెనపల్లి, పెదకూరపాడు క్లస్టర్ శ్రీనిధి మేనేజర్ వై. సంతోష్ (వివో)- విలేజ్ ఆర్గనైజర్స్ రిజిసర్లను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ 2017 ఏడాదిలో ప్రారంభమైన స్త్రీ నిధి రుణాలు 2018 -19 నుండి అచ్చంపేట మండ లంలో 42 గ్రామ సంఘాలకు ఐదు కోట్ల రుణాలు ఇవ్వగా నేటికీ రూ.72 లక్షలు బకాయిగా ఆన్‌లైన్ చూపిస్తోందన్నారు. అందులో పెదపాలెం క్లస్టర్లో వీరాంజనేయ వివో రూ.8,30,000, పెదపాలెం వివో రూ.2,42,000 అంబేద్కర్ వివో రూ.3,30,000, పెదపాలెం స్నేహ వివోలో రూ.8,12,000 మొత్తం రూ.20 లక్షలకు పైగా బకాయి ఉందన్నారు. విచారణ జరుపుతుంటే గ్రూపు సభ్యుల వద్దకు వెళ్ళగా వివోలకు నగదు చెల్లించామన్నారు. వివోలో విచారణ చేస్తే అప్పటి సీసీ బాబీకి ఇచ్చినట్లు వారు చెబుతున్నా రన్నారు.

తమ తనిఖీలు రిజిస్టర్లు సరిగా రాయకపోవ డం, శ్రీనిధి రుణాల సంబంధించి ఐవిఆర్ పూర్తి చేయడం గుర్తించా మన్నారు. గతంలో పనిచేసిన సిబ్బంది తమ ఇష్టానుసారంగా వ్యవహరించడం శ్రీనిధి సొమ్మును స్వాహా చేయడం, బాధ్యులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారన్నారు. శ్రీనిధి రుణం వివో వాళ్ళకి పూర్తి బాధ్యత ఉంటుందని అవసరమైతే సిసిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి నగదు జయ చేయాలని తెలి పారు. ఈ క్రమంలో వివో సభ్యులు గతంలో వేతనాలు అందక తామే నగలు వాడుకుందామని జిల్లా విచారణ బృందానికి మండల అధికారుల సమక్షంలో రాత పూర్వ కంగా సిసి రాసి ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు.అయినప్పటికీ వారిని విధుల నుండి తొలగికుండా నేటికీ వేతనాలు ఇవ్వడంలో అధికారుల పని తీరుపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయంటూ వివో సభ్యులు అధికారులను నిలదీస్తున్నారు.

తాము ఒక నెల చెల్లించకపోతే తమ వేతనాలు జమ చేసుకున్న అధికారులు విచారణలో నగదు దుర్వినియోగానికి పాల్పడ్డామని ఒప్పుకున్నా చర్యలు తీసుకోకపోవడం వేతనాన్ని జమ చేసుకోకపోవడం ఏమిటని అధికారులను వివోలు ప్రశ్నించారు. వెలుగు కార్యాలయ సిబ్బంది శ్రీనిధి రుణాలు పేరిట డ్వాక్రా సభ్యుల దగ్గర నుండి ఇన్సూరెన్స్ డబ్బులు వసూలు చేస్తూ రెండు సంవత్సరాలుగా ఒక రూపాయి కూడా శ్రీనిధి రుణాలు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఇలాంటి సిబ్బందిపై చర్యలు తీసు కోవాలని డ్వాక్రా సంఘాల మహిళలు వేడుకుంటున్నారు.





పెదకూరపాడులో..

ఆరు నుంచి పద్నాలుగేళ్ల పిల్లలు బడిలోనే ఉండాలి

'పని వద్దు.. బడి ముద్దు' అంటూ పెదకూరపాడు, తాళ్లూరులో ర్యాలీలు

ప్రజాశక్తి- పెదకూరపాడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకట రమణ ఆధ్వర్యంలో శనివారం పెదకూరపాడు వీధుల్లో, తాళ్లూరులో వేర్వేరుగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థుల నినాదాలతో ఈ ర్యాలీ సాగింది. 'పని వద్దు- బడి ముద్దు, అందరం చదువుకుందాం-అందరం ఎదుగుదాం, పెద్దలు పనిలో- పిల్లలు బడిలో' నినాదాలతో ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ ఆరు సంవత్స రాలు మొదలుకొని పద్నాలుగేళ్ల వయసు గల పిల్ల లందరూ బడిలోనే ఉండాలని అన్నారు. ఆ విధంగా తల్లి దండ్రులు తమ బిడ్డలను ప్రోత్సహించాలని చెప్పారు.





మరో ముఖ్యఅతిథి ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకట రమణ మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ నూతనంగా ప్రవేశపెట్టిన బడికి పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయా ల్సిన బాధ్యత గ్రామంలోని ప్రతి ఒక్క తల్లి దండ్రుల మీద ఉందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు అన్ని వసతి సౌకర్యాలతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్స్ లు , స్కూల్ యూనిఫామ్ బెల్టు బ్యాగులు ఇవ్వటం జరుగుతుందని, ఇలాంటి సౌకర్యాలను ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాధాకృష్ణ, రాయపూడి సాంబశివ రావు, మురళీధర్, సత్యవతి, కన్యా కుమారి శ్రీనివాస్, రజియా,నరేష్ పాల్గొన్నారు .

ప్రజాశక్తి-యడ్లపాడు

'నేను బడికి పోతాలో భాగంగా యడ్లపాడు మండల విద్యాశాఖాధికారులు యండిఓ ఆఫీసులో ప్రధానో పాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారులు మాట్లాడారు. కార్యక్రమంలో సిడి పిఒ జి.శాంతకుమారి పాల్గొన్నారు.

వైసిపికి ఓటేశారని దాడులు చేయడం తగదు

ప్రజాశక్తి-బెల్లంకొండ

ప్రజాస్వామ్యంలో గెలిచినవారు ప్రజలకు మంచి చేయాలని, వైసిపికి ఓటు వేశారని దాడులు చేయడం అప్రజాస్వామికమని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. తెలుగుదేశం అరాచక శక్తుల దాడిలో గాయపడిన నరుకుళ్ళపాడుకి చెందిన భోద వెంకటరామమ్మ, బోధ నాగరాజులను, బెల్లంకొండ మండలం మన్నె సుల్తాన్ పాలెం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డిలను శనివారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పెద కూరపాడు నియోజకవర్గంలో చాలా గ్రామాలలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులపై దాడులు చేస్తున్నారని, ఇటువంటి సంస్కృతీ గతంలో ఎప్పుడూ లేదన్నారు. దాడులను అరికట్టి, వారిపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని కోరారు.



బాధితుడిని పరామర్శిస్తున్న నంబూరు శంకరరావు

సాగర్ నీటిమట్టం 504 అడుగులు

ప్రజాశక్తి- విజయపురిసౌత్

నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 504. 40 అడుగుల వద్ద ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. సాగర్ జలా శయం నుంచి ఎస్ఎల్బీ సీకి 800 క్యూసెక్కుల నీరు విడుదలవు తోం ది. శ్రీశైలం జలాశయ నీటి మట్టం 814. 70 అడుగుల వద్ద ఉండగా, శ్రీశైలం జలాశయానికి 899 క్యూసెక్కులు వచ్చి చేరుకున్నట్లు అధి కారులు పేర్కొన్నారు.

దోమలపై ఎంటమలాజికల్ సర్వే

ప్రజాశక్తి తెనాలి

పట్టణంలోని ఇందిరా యానాది కాలనీలో దోమలపై ఎంటమలాజికల్ సర్వే నిర్వహించారు. గుంటూరు జోనల్ మలేరియా కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ గొల్ల వీర్రాజు ఆధ్వర్యంలో స్థానిక మలేరియా, ఫైలేరియా యూనిట్ల సహకారంతో దోమల రకాలపై ఎంటమలాజికల్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో దోమలను సేకరించి వాటిని అధ్యయనం చేయడంతో పాటు దోమల ద్వారా వ్యాపించే వివిధ రకాల వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, మెదడు వాపు, బోదకాలు, జికా వైరస్ తదితర వ్యాధులపై


సర్వేపై మాట్లాడుతున్న డైరెక్టర్ వీర్రాజు

అవగాహన కల్పించారు. కాలనీలోని గహాలను సందర్శించి దోమ లార్వాలను పెరుగుటకు అవకాశం ఉన్న మూలాలను తొలగించారు. అనంతరము మలేరియా మాసోత్సవ ర్యాలీను స్థానిక ప్రజలు, స్థానిక ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసానిప్రభాకరరెడ్డి, యుఎల్ బి ఆరోగ్య విస్తరణాధికారి ఎ బాలచంద్రమౌళి,పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, గ్రామీణ సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి, కోడెల శ్రీనివాస రావు, బుస్సా సుధాకరరావు, ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్స్పెక్టర్ జి రవికుమార్, సూపర్వైజర్స్ డి శ్రీనివాసరావు, దాసరి శివనాగమల్లేశ్వరరావు, టి శివరాం ప్రసాద్, బండారు మల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ మున్నంగి రత్నాకరరావు, షేక్ రషీద్, షేక్ నవీద్, షేక్ బాషీద్, ఏఎన్ఎం తిరుపతమ్మ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అతిసారపై ప్రజలకు అవగాహనుండాలి : కమిషనర్

ప్రజాశక్తి మంగళగిరి

అతిసార కేసుల నియంత్రణ చర్యల్లో భాగంగా వ్యక్తిగత పరి శుభ్రతపై ప్రజల్లో అవగాహన తప్పనిసరి అని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ వి నిర్మల్ కుమార్ శనివారం తెలిపారు. రానున్న రోజుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో సీజనల్‌గా వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. డయేరియా వంటి వ్యాధులపై నగర ప్రజలందరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విరోచనాలు, అధిక వాంతులు, నీరసం అవడం, పొత్తి కడుపు నొప్పి, డీహైడ్రేషన్ (గొంతు ఆరిపోవడం) డయేరియా లక్షణాలని కావున ఎవరు నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని తెలియ చేశారు. ప్రజలు తమ పరిసర ప్రాంతంలో తాగు నీళ్ల రంగు మారటం పరిశుభ్రంగా లేక పోవటం వంటివి గుర్తించిన యెడల తక్షణమే సంబంధిత సచివాలయం లేదా నగర పాలక సంస్థ కార్యాలయంలో సంప్రదించినచో తక్షణం పరిష్కార చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే హెల్త్ సెక్రెటరీ లకు , ఇంజనీరింగ్ సిబ్బందికి తాగునీటి సరఫరా పై మరియు సీజనల్ వ్యాదులు ప్రబలకుండా తీసుకొను చర్యల పై ఆదేశాలు జారీ చేయడమైనదని ఆయన తెలిపారు. నివాస గృహాల్లో నిల్వ ఉంచిన నీటిలో, పూల కుండీలలో దోమల లార్వా పెరిగి డెంగీ, మలేరియా వచ్చే ప్రమాదం ఉందని, కావున నీటిని నిల్వ ఉంచకుండా చూసుకోవడంతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని హెల్త్ సెంటర్లో సంప్రదించాలని ఆయన కోరారు.



కొనసాగిన ప్రజాదర్బార్

ప్రజాశక్తి-తాడేపల్లి :అమరావతి కరకట్టపై గల తన నివాసంలో మంత్రి నారా లోకేష్ శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. అనేక మంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాదర్బార్ ద్వారా అనేక సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని, వాటి పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తా మని చెప్పారు.

కేకేను కలిసిన తిరుమల శెట్టి

ప్రజాశక్తి మంగళగిరి



ఎన్నికల ఫలితాలు కిరణ్ కొండేటి (కే కే).చెప్పినట్లుగా రావటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసిందని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు తిరుమల శెట్టి కొండల రావు అన్నారు.కిరణ్ కొండేటితో దీక్ష మీడియా ఆధ్వర్యంలో శనివారం కుంచనపల్లిలోని శ్రీ ఫార్చ్యూన్ గ్రాండ్ హోటల్ లో సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను కాపు బలిజ సంక్షేమ సేన మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు జనసైని పార్టీ నాయకులు తిరుమల శెట్టి కొండలరావు మర్యాదపూర్వకంగా కలిసి కేకేను అభినందించారు. ఇదే విధంగా భవిష్యత్తులోను నిబద్ధతతో కూడిన సర్వేలను నిర్వహించాలని ప్రజల మన్ననలను పొందాలని తిరుమలశెట్టి కోరారు.

అయ్యన్నపాత్రుడికి ధూళిపాళ్ల సన్మానం

ప్రజాశక్తి -పొన్నూరు



శాసనసభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన చింతకాయల అయ్యన్న పాత్రుడుని శనివారం పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ శాలువా, బొకే లతో అయ్యన్నపాత్రుడును ఘనంగా సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. శాసనసభ హౌస్‌ను సమర్ధతతో, హుందా తనంగా నడిపి ఐదు కోట్ల ఆంధ్ర ప్రజలలో చిరస్థాయిగా నిలిచి, టిడిపికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మంచి పేరు తీసుకువచ్చి రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తారని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ఆకాంక్షించారు.

హిందూ ఫార్మసీలో యోగా డే

ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, కల్చరల్ యూనిట్‌ల సంయుక్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పాలక మండలి ఛైర్మన్ జూపూడి రంగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యోగా ప్రాధాన్యతను ఆయన విద్యార్థులకు వివరించారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదన రావు ప్రసంగించారు. యోగాచార్యులు ఆర్.ఎ.అప్పారావు యోగాసనాలు సాధన చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

డాక్టర్ ఎ.ప్రత్యూష, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ పి.సీతారామయ్య, జె.శివజ్యోతి, డాక్టర్ ఎ.రాజేష్, ఎన్‌సిసి ఏఎన్ఓ సిహెచ్.అజిత్‌బాబు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి సహాయ మలేరియా అధికారి కార్యాలయంలో మలేరియా పై శిక్షణ తరగతులు నిర్వహించారు. తెనాలి పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహి స్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు మలేరియా పరీక్షలు నిర్వహ ణపై శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం శనివారం ప్రారంభి ంచారు. జ్వర పీడితుల నుండి రక్తపూతలు సేకరణ, వాటిని పరీక్ష చేసే విధానంతో పాటు, పలు రకాల మలేరియాలను మైక్రోస్కోప్ ద్వారా గుర్తించే నైపుణ్య శిక్షణను అందించారు. గుంటూరు జిల్లా మలేరియా కార్యాలయంలో సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ బెన్ని రక్త పరీక్షల్లో మెళకువలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు.



ల్యాబ్ టెక్నీషియన్లతో మాట్లాడుతున్న మలేరియా అధికారులు

సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి ల్యాబ్ లో నిర్వహించాల్సిన రికార్డుల వివరాలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమ ంలో టెక్నీషియన్లు శ్రీవిద్య, ధనలక్ష్మి, గంగారెడ్డి, శివకృష్ణ, సుధీర్, కమలాకర్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కొలకలూరులో ఘనంగా ఏరువాక

ప్రజాశక్తి తెనాలి

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ వెంకటేశ్వర్లు చెప్పారు. రూరల్ గ్రామం కొలకలూరు పంచాయతీ పరిధిలో కాజీపేట గ్రామంలో ఆదిత్య నందనవనం ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్పిఒ) ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఏరువాక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరి సాగుకు రైతులు శ్రీకారం చుడుతున్నారని, వెద పద్ధతిలో విత్తనాలు చల్లుతారన్నారు. సాగుకు ముందు భూమిలో పచ్చిరొట్ట విత్తనాలు వేసి కలియదున్నితే భూసారం పెరుగుతుందన్నారు. రైతు భరోసా కేంద్రాలు భూసార పరీక్షలు నిర్వహిస్తున్నాయన్నారు. వరి వంగడాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా కేజికి ఐదు రూపాయలు రాయితీపై అందిస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయం డిపిఒ రాజకుమారి మాట్లాడుతూ సిఆర్పిల ద్వారా నందివెలుగులో పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుందన్నారు. తెనాలి ఏడిఏఎన్ ఉషారాణి మాట్లాడుతూ సాగులో


ఏరువాకలో రైతులు, వ్యవసాయ అధికారులు

రైతులు వ్యవసాయ అధికారుల సలహాలను, రైతు భరోసా కేంద్రాల సేవలను ఉపయోగించుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధకారి జి ప్రేమ సాగర్ మాట్లాడుతూ రైతులు ఎఫ్పిఒల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ జి మోహన్, వి ఏ ఏ లు జి నాగరాజు, నాగేంద్ర, వంశీ, ఎఫ్పిఒ గ్రూప్ డైరెక్టర్ వై హనుమంతరావు, సభ్యులు, సీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు కేశన అభినందనలు

ప్రజాశక్తి మంగళగిరి

రాష్ట్రానికి చెందిన శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు బీసీ యువనేత కింజరపు రామ్మోహన్ నాయుడును కేంద్ర మంత్రిగా నియమించుటలోను, ఐఏఎస్,ఐపీఎస్ అధికారులను పాలనా రంగంలోని, ఉన్నతోద్యోగుల నియా మకాలలో సమర్థత-నిజాయితీలకు పట్టంగట్టి, సామాజిక న్యాయాన్ని కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాటించారని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు హర్షం వ్యక్తం చేశారు. మంత్రివర్గ నియామకంలోనూ, బలహీన వర్గాలకు కీలకమైన శాఖలను కేటాయించారన్నారు. గత ప్రభుత్వంలో ఎంతోమంది సమర్ధులైన, నిజాయితీ పరులైన అధికారులను పక్కనపెట్టి, కేవలం తమ వర్గం వారని,తమ అనుయాయుల సిఫారసుల మేరకు పాలనా రంగం లో ఉన్నతాధికారుల నియామకం జరపడం వల్లనే,జగన్ పాలన అసమర్ధతతో, అవినీతి అక్రమాలతో సాగిందన్నారు. ప్రజలందరికీ సామాజిక న్యాయాన్ని తెలుగుదేశం ప్రభుత్వం అందిస్తుందని శంకరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

పార్వతీపురం ఎమ్మెల్యేను కలిసిన 'మా-ఎపి'

ప్రజాశక్తి-తెనాలిరూరల్


ఎమ్మెల్యే విజయ చంద్ర కు జ్ఞాపిక అందిస్తున్న దిలీప్ రాజా, మిలటరి ప్రసాద్

బాపూజీ బయోపిక్ చిత్రంలో నటులు విజయ చంద్ర విజయనగరం జిల్లా పార్వతీపురం నియో జకవర్గం శాసనసభ్యుడిగా గెలుపొందడం మా-ఎపి కి గర్వకారణమని సిని దర్శకులు దిలీప్ రాజా అన్నారు. స్థానిక కార్యాల యంలో శనివారం ఏర్పటుచేసిన విలేకరుల సమావేశంలో దిలీప్ రాజా మాట్లాడుతూ తాను దర్శకత్వం వహిస్తున్న బాబు జగజ్జీవన్ రామ్ బయోపిక్ 'బాపూజీ' చిత్రంలో పార్వతీపురం శాసన సభ్యులు విజయచంద్ర ప్రముఖ పాత్రలో నటిస్తున్నారని పేర్కొన్నారు. ఎపి లో జరుగుతున్న అసెంబ్లీ సమావేశంలో శనివారం ఎమ్మెల్యే విజయచంద్రను మర్యాదపూర్వకంగా కలసి అభినందించినట్లు తెలిపారు. మా-ఎపి జ్ఞాపికను అందజేసామన్నారు. నటుడు మిలటరి ప్రసాద్ మాట్లాడుతూ మంచి టైమింగ్, క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా విజయ చంద్ర ఆయనకి ఆయనే సాటి అన్నారు. కార్యక్రమములో సహాయ దర్శకుడు వెంకి రావణ్, అయినంపూడి రాకేష్ పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై నేడు ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య విధానంపై నేడు ఆరోగ్య సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అవగాహన సంస్థ గత 15 సంవత్సరాలుగా ఆరోగ్య సభలు నిర్వహిస్తుందని, దీనిలో భాగంగా 'ఆయుర్వేద వైద్య విధానం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం' అన్న అంశంపై ఆదివారం ఉదయం 11 గంటలకు అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని, ఈ సభలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ దివి సీతారామ కిషోర్ ప్రధానవక్తగా పాల్గొంటారన్నారు. ఆయుర్వేద వైద్యంపై సమగ్ర అవగాహన కలగ చేయడానికి ఏర్పాటు చేసిన ఈ సభలో వివిధ వ్యాధులు - ఆయుర్వేద చికిత్స, ఆయుర్వేదం పై అపోహలు, ఆయుర్వేద వైద్య చరిత్ర, ఆహార, విహార నియమాలు తదితరాలపై డాక్టర్ సీతారామ కిషోర్ వివరిస్తారన్నారు.కావున ఆరోగ్యాభిలాషులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

24న జిఎంసిలో గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల నుండి అందే ఫిర్యాదులు, ఫిర్యాదుల స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రస్ సిస్టం..పిజిఆర్ఎస్)ను ఈనెల 24న జిఎంసి ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి జరుగుతుందని, సదరు కార్యక్రమంలో నగరపాలక సంస్థ వివిధ విభాగాధిపతులు, అధికారులు పాల్గొంటారన్నారు. కావున నగర ప్రజలు తమ స్థానిక సమస్యపై పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీలు, ఫిర్యాదులను అందించవచ్చని, వాటిని నిర్దేశిత సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ, సీడాక్ ఈడీ

విజ్ఞాన్స్, సీడాక్‌ల మధ్య అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, బెంగుళూరులోని సీడాక్ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్డ్ కంప్యూటింగ్)ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. శనివారం వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీడాక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.డి.సుదర్శన్‌తో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన విద్యార్థులకు, అధ్యాపకులకు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ రంగాలలో ప్రత్యేక శిక్షణ లభిస్తుందన్నారు. అంతేకాకుండా రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, బిగ్‌డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, రోబోటిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, వీఎల్ఎస్ఐ, ఆర్ఎఫ్ మైక్రోవేవ్, డ్రోన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ టెక్నాలజీలను మరింత చేరువ చేస్తామన్నారు. విద్యార్థులకు ఎంపికచేయబడిన టెక్నాలజీలలో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లను కూడా అందిస్తామన్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచే పరిశ్రమలకు ఉపయోగపడే విధంగా మైనర్ లేదా క్రెడిట్ కోర్సులను వారి సిలబస్‌లో చేర్చుతామన్నారు. ఇండస్ట్రీ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు మా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రాక్టికల్‌గా అనుభవాలను కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా సీడాక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌డీ.సుదర్శన్ మాట్లాడుతూ విజ్ఞాన్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదు నివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సీడాక్ సైంటిస్ట్ ఎఫ్ హరిబాబు, విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.



శేషాద్రిని సత్కరిస్తున్న భూసురపల్లి వెంకటేశ్వర్లు తదితరులు

శేషాద్రికి భూసురపల్లి పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రఖ్యాత డోలు విద్వాంసులు, డోలు వాద్య కళానిధి, లయజ్ఞాన కేసరి లయబ్రహ్మ భూసురపల్లి ఆదిశేషయ్య పురస్కారం-2024 విద్యా వాచస్పతి డాక్టర్ కోమాండూరి శేషాద్రికి అందజేశారు. శనివారం స్థానిక బందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై నగదు పురస్కారంతోపాటు శేషాద్రిని ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా జరిగిన సభకు సాహిత్యవేత్త మోదుగుల రవికష్ణ అధ్యక్షత వహించగా, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ తండ్రి పేరుతో గతంలో పద్మశ్రీ అన్నవరపు రామస్వామి, కమలాకరరావు, భీమరాజు సూర్యారావు, పద్మశ్రీ షేక్ మహబూబ్ సుభాని, పద్మశ్రీ షేక్ కలిశాబి మహబూబ్ దంపతులకు, 2023లో ద్వారం దుర్గాప్రసాదరావుకు పురస్కారాలు అందజేశామని తెలిపారు. 2024 సంవత్సరాలకి ప్రముఖ సంగీత, వయోలిన్, గాత్ర విద్వాంసులు డాక్టర్ కొమాండూరి శేషాద్రికి అందజేస్తున్నట్లు వివరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, రామరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆచార్య ఎం.కోటేశ్వరరావు, భూసురపల్లి విజయలక్ష్మి, రాహుల్ సురేష్ బాబు, ప్రదీప్తి ప్రహ్లాదుడు, మౌనిక వేద వ్యాసుడు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని అభివృద్ధికి కదలిక

వీక్షణం

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటుతో రాజధాని అమరావతిపై అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. సిఎం చంద్రబాబు నాయుడు, ఉన్నతాధికారులు రెండు రోజుల క్రితం రాజధాని గ్రామాలను సందర్శించారు. 2019కి ముందు నిర్మించిన వివిధ నిర్మాణాలను పరిశీలించి వీటిని పూర్తిచేసేందుకు కార్యచరణను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. దీంతో రాజధాని రైతుల్లో ఉత్సాహం వచ్చింది. మూడు రాజధానులకు వ్యతిరేకంగా 1631 రోజులు ఉద్యమం నిర్వహించిన రైతులు ఎట్టకేలకు తమ ఆందోళనను విరమించారు. రాజధాని నిర్మాణం ద్వారా సంపద సృష్టిస్తామని సిఎం చంద్రబాబు ప్రకటించడంతో రైతులు తమ భూముల అభివృద్ధిపై దృష్టి సారించారు. ప్రభుత్వం తక్షణం రిటర్నబుల్ ప్లాట్ల అప్పగింతపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతులపైకు ప్రాధాన్యత ఇవ్వాలని రాజధాని వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. రాజధాని అభివృద్ధికి హైదారాబాద్‌లో ఉన్న కార్పొరేట్ ఆస్పత్రులను, ఇతర ప్రభుత్వ రంగసంస్థలను తక్షణం అమరావతికి రప్పించగలిగితే అభివృద్ధి వేగవంతం అవుతుందని పలువురు అధికారులు ప్రభుత్వపెద్దలకు విన్నవించినట్లు తెలిసింది. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత మూడు రాజధానుల అంశం తెరపైకి రావడంతో అమరావతితో ఏర్పాటుచేయాలనుకున్న పలు విద్యా, వైద్య సంస్థలు వెనక్కి వెళ్లాయని వీటిని తిరిగి రప్పించడానికి గట్టి ప్రయత్నం చేయాలని సిఎం చంద్రబాబు అధికారులకు సూచించినట్లు తెలిసింది. ప్రతిపాదిత దశలో ఉన్న మెట్రో రైలు ఏర్పాటు సాధ్యా సాధ్యాలపై కూడా దృష్టి సారించాలని యోచిస్తున్నారు. అలాగే అమరావతి రైల్వే లైను ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ప్రత్యేక రైల్వే లైన్ కు సంబంధించి భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. విజయవాడ, గుంటూరు రైల్వే లైన్లతో రాజధాని అమరావతికి కనెక్టివిటీ కోసం ప్రతిపాదించిన ఈ కొత్త రైల్వే లైన్ 2017 -18లో మంజూరు చేశారు. రూ.2600 కోట్ల అంచనాలతో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం-అమరావతి- నంబూరు మధ్య 56.53 కిలోమీటర్ల మేర డబ్బులు లైన్, అమరావతి- పెదకూరపాడు మధ్య 24 కిలోమీటర్ల సింగల్ లైన్, సత్తెనపల్లి - నరసరావుపేట మధ్య 25 కిలోమీటర్ల సింగిల్ లైన్ కలిపి మొత్తం 106 కిలోమీటర్ల మేర కొత్త లైన్ కు ఆమోదం తెలిపారు.. కానీ గత ఐదేళ్ల వైసిపి హయాంలో ఎటువంటి ముందడుగు పడలేదు. ఇప్పుడు మళ్లీ ఈ రైల్వే లైనుపై కదలిక వచ్చింది. ఈ లైన్ కు గుంటూరు, పల్నాడు, కష్ణ, ఖమ్మం జిల్లాల పరిధిలోని 450 హెక్టార్ల మేర భూసేకరణ చేయబోతున్నారు. ఈ సింగిల్ లైన్ నిర్మాణంతో పాటు భూసేకరణకు రూ.2500 కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేసింది. 9 కొత్త రైల్వే స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. మరోవైపు రాజధానిగ్రామాల్లో గత 10 రోజులు రియల్టర్ల కదలికలు ప్రారంభం అయ్యాయి. హైదరాబాద్, విజయవాడ, కర్నూలు, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి రియల్టర్లు రాజధాని గ్రామాలకు వెళ్లి తమకు అనువైన భూములను పరిశీలించి వస్తున్నారు. అలాగే తాడికొండ, అమరావతి, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో రాజధాని పరిధిలో లేని గ్రామాల్లో భూములపై కూడా రియల్టర్లు దృష్టి సారించారు. ముందస్తు కొనుగోలుచేసే రాబోయే ఐదేళ్లలో ఏమేరకు ధరలు పెరుగుతాయోనని నిపుణులతో అంచనాలు వేసుకుంటున్నారు. **(ఎ.వి.డి.శర్మ)**

స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలి : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు



గర్భస్థలింగ నిర్ధారణ చట్టంపై డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రొప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆన్లైన్‌లో రిజిస్టర్ అయ్యే కొత్త స్కానింగ్ సెంటర్లు, రెన్యువల్ స్కానింగ్ సెంటర్లను తప్పనిసరిగా ప్రోగ్రాం ఆఫీసర్లు సందర్శించి తనిఖీ చేయాలని, చట్టాన్ని ఉల్లంఘించిన కేంద్రాలపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మొత్తం 283 గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షా కేంద్రాలు వున్నాయని, వాటిలో నాలుగు రెన్యువల్ రిజిస్ట్రేషన్ కోసం, 12 మాడిఫికేషన్ కోసం, రెండు క్యాన్సిలేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. అలాగే క్రొత్తగా తొమ్మిది స్కానింగ్ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేసుకొన్నారని, వాటిని కమిటీ సభ్యులు, ప్రోగ్రాం ఆఫీసర్లు తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పురుష, స్త్రీ నిష్పత్తి (1000:952) ఎక్కువుగా నమోదు అయిన తెనాలి డివిజన్‌లోని 25 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. కానీ సదరు ఆపరేషన్‌లో ఉల్లంఘనలు జరిగినట్లు నిర్ధారణ కాలేదని డియంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్ర మంలో, జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి, ఎల్.అరుణ పాల్గొన్నారు.

నైపర్‌లో చిప్స్ ఫార్మసీ విద్యార్థులకు ర్యాంకులు

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజి విద్యార్థులు జాతీయ స్థాయిలో ఎం.ఫార్మసీ ప్రవేశాలకు నిర్వహించిన నైపర్-2024లో ఫలితాల్లో పలు ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర తెలిపారు. దేశవ్యాప్తంగా సుమారు 6వేల మంది ఈ పరీక్షకు హాజరవగా తమ కళాశాలకు చెందిన బి.ఫార్మసీ విద్యార్థులు డి.రసజ్ఞ 957వ ర్యాంకు, సిహెచ్.సంగీత 2953వ ర్యాంకు, వి.రత్నశ్రీ 3446వ ర్యాంకు, ఎస్.ఉదయ్‌కిరణ్ 4326వ ర్యాంకు, ఎం.నిఖిల్ 4677వ ర్యాంకు, డి.మంజుల 4985వ ర్యాంకు, ఎం.దేవరాజకుమార్ 5075వ ర్యాంకు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి సిఎన్.శ్రీనివాస్, కోశాధికారి రాయపాటి గోపాలకృష్ణ ర్యాంకర్లను అభినందించారు.



ర్యాంకర్లతో ప్రిన్సిపాల్ తదితరులు

చలపతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు : ఎం.ఫార్మసీ ప్రవేశాల కోసం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్) నిర్వహించిన అర్హత పరీక్షలో తమ కళాశాలలో బి.ఫార్మసీ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి అర్హత సాధించారని కళాశా ప్రిన్సిపాల్ ప్రొపెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నైపర్-2024లో తమ కళాశాల విద్యార్థిని కె.విజయ అధ్యాపకుల ప్రోత్సాహకంతో కష్టపడి చదివి, 756వ ర్యాంకు సాధించిందని తెలిపారు. అంతేకాకుండా మొత్తం 10 మంది విద్యార్థులు నైపర్-2024లో అర్హత సాధించారని తెలిపారు. ఆయా విద్యార్థులను, అధ్యాపకుల్ని చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులు